

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# కూతపెట్టి..చెడుగుడు

## కబడ్డీ కోర్టులో మల్లారెడ్డి

**కీసర, మార్చి22, ప్రభాతవార్త:** యువత క్రీడల్లో రాణించాలని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామ కూర మల్లారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి దంప తుల 50వ వార్షికోత్సవం సందర్బంగా కీసరలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బిఆర్ఎస్ సీనియర్ నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి ఆద్వర్యంలో యువతకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణస్దాయిలో క్రీడలను ప్రోత్సహించ డం ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యవంతమైన జీవన శైలి పెంపొందుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా విచ్చేసి కబడ్డీ ఆడి పలువురిని అబ్బుం`పరిచారు. కబడ్డీ పోటీలలో గెలిచిన విజేతలకు మొదటి బహుమతి 50 వేలు, రెండవ బహుమతి 25 వేలు, మూడవ, నాలుగవ బహుమతులకు 10 వేల చొప్పున నగదును అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ సంఘం వైస్ ప్రెసిడెంట్ కాసాని వీరేష్, జనరల్ సెక్రటరీ మద్ది మహేందర్‌రెడ్డి, కీసర మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, బిఆర్ఎస్ నేతలు గుర్రం మల్లారెడ్డి, బొడుసు రమేష్, గుర్రం వరకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



# సిద్దిపేటపై వివక్ష లేదు..

# ఇకముందూ ఉండదు

## అదే ఉంటే అయిల్ ఫాం ఫ్యాక్టరీని కొడంగల్‌కు తీసుకుపోలేనా?

**కెసిఆర్ కుటుంబంతో రాజకీయంగా విభేదాలు ఉన్నా.. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లకు సమానంగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం - అభివృద్ధికి అడ్డొస్తే దాటుకుంటూ వెళ్తా - నర్మెట సభలో సిఎం రేవంత్‌రెడ్డి**





వ్యవసాయ స్టాళ్లను తిలకిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/నంగునూర్, మార్చి 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని నియోజవర్గాలను అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో సమానంగా చూస్తానని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నంగనురూర్ మండలం నర్మెటలో మలేషియా టెక్నాలజితో నిర్మించిన రూ.300 కోట్లతో నిర్మించిన అయిల్‌ఫాం ఫ్యాక్టరీని ప్రారంభించారు. రూ.80 కోట్లతో నిర్మించ తలపెట్టిన అయిల్ రిఫైనరీతో పాటు రూ.750 కోట్లతో నిర్మించ తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మొదట విడతలో భాగంగా 70 లక్షల మంది రైతులకు రూ.3600 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట అభివృద్ధిపై వివక్ష చూపకుండా నిధులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**సిద్దిపేట రైతుల సంక్షేమం కోసమే..**

'అభివృద్ధిలో అడ్డుపడితే ఆగను. ప్రజలు అండగా ఉంటే దాటుకుంటూ వస్తా. రైతు బిడ్డను.. రైతు కుటుంబం నుంచి వచ్చాను. రైతుల సంక్షేమానికి దేనికైనా సిద్దామే. ప్రజాపాలనలో ఎన్ని సమస్యలు వచ్చిన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతుల సంక్షేమానికి ఎక్కడా లోటు రానివ్వకుండా కృషి చేస్తున్నా. తాను సిద్దిపేటలో అభివృద్ధిని అపాలనుకుంటే అయిల్‌ఫాం ఫ్యాక్టరీని కొండగల్‌కు తీసుపోలేనా? ఇక్కడి రైతుల సంక్షేమ, అభివృద్ధే లక్ష్యంగా ఫ్యాక్టరీని ప్రారంభించాం. సిద్దిపేట అయిల్ ఫాం ఫ్యాక్టరీ తరహాలోనే కొడంగల్‌లోనూ నిర్మిస్తాం. యుద్ధం మూలంగా యూరియా కొరత వచ్చే అవకాశం ఉంది. రామగుండంలో ఉత్పత్తి చేసే యూరియా తెలంగాణకు ఇచ్చేలా ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లి ఎక్కువ యూరియా తెచ్చుకునేలా కృషి చేద్దాం. కెసిఆర్, కెటిఆర్‌లతో రాజకీయంగా భిన్నభిప్రాయాలు ఉండొచ్చు కానీ ఎక్కడా అభివృద్ధిని అపలేదన్నారు.

సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలకు సమానంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిజాయితీని చాటుకున్నాం. అయిల్ ఫాం ఫ్యాక్టరీ సిద్దిపేట ఎమ్మెల్యే కోసం నిర్మించలేదు.. అభివృద్ధిపై ఎలాంటి వివక్ష చూపబోను' అని స్పష్టం చేశారు.

ఆసక్తిగా వ్యవసాయ స్టాళ్ల సందర్శన

అంతకు ముందు ఫ్యాక్టరీ ఆవరణలో రైతు మహోత్సవాల్లో భాగంగా వ్యవస్థాయ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

ఆయన వెంట మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ్మా, గడ్డం వివేక్‌వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపి వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, ఐలయ్య యాదవ్, ఎంపి రఘునందన్‌రావు, అయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా ఆర్టీఏ సభ్యులు డాక్టర్ సూర్యచంద్రవర్మ, డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జిలు హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా అయిల్‌ఫాం ఫ్యాక్టరీ ప్రారంభ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే దూరంగా ఉన్నారు.



# సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు

**కొడంగల్, మార్చి 22 ప్రభాతవార్త:** శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్దానం మాదిరిగా వైభవంగా కొనసాగుంతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో శ్రీవేంకటేశ్వర స్వామి రోజుకో వాహనంపై వీధులు మీదుగా జాతర స్దలం వరకు వెళ్తూ ప్రజలకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. ఆదివారం 7వ రోజు ఉదయం వేళల్లో సూర్యప్రభ వాహనంపై దర్శనమివ్వగా సాయంత్రం వేళల్లో చంద్రప్రభ వాహనంపై ఊరేగుతు ప్రజలకు దర్శన భాగ్యం కల్పించారు. 9 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల్లో టీటీడీ అర్చకులు శ్రీబాలాజీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను కొనసాగిస్తున్నారు. సాయంత్రం వేళలోల్లో నిర్వహిస్తున్న స్వామివారి ఊయ్యాల సేవలో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్దులు సాంస్రృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కార్యక్రమాల్లో పాల్గొంటున్న చిన్నారులకు ప్రోత్సహక బహుమతులను దేవస్దానం అద్వర్యంలో అందించడం చోటుచేసుకుంటుంది. మరో 2 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల్లో ప్రాధాన్యత సంతరించుకునే స్వామివారి రథోత్సవం చక్ర స్నానం తదితర కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కాగా బ్రహ్మోత్సవాల్లో ఆదివారం తెలంగాణా రాష్ట్ర పోలీస్‌హౌసింగ్ కార్పోరేషన్ చైర్మేన్ గురునాథ్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# షాద్‌నగర్‌లో మహిళ హత్య

**షాద్‌నగర్, మార్చి 22, ప్రభాతవార్త :** మహిళ దారుణ హత్యకు గురైన ఘటన ఆదివారం షాద్ నగర్ నియోజకవర్గంలో కలకలం రేపింది. పోలీసుల స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే ఫరూక్ నగర్ మండలం దేవునిపల్లి పంచాయతీ పరిధిలోగల రంగారెడ్డిగూడ గ్రామానికి చెందిన పోతుల కరుణమ్మ తన రెండవ కుమార్తె శోభనం రాజు అనే వ్యక్తితో పదేళ్ల క్రితం వివాహం చేసిందన్నారు. ఒక బాబు పుట్టాక కొన్ని కారణాలవల్ల ఇద్దరి మధ్య గొడవలు తలెత్తి విడిపోయారని, ఈ నేపథ్యంలోనే కోయిలకొండకు చెందిన నర్సింలును శోభ ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా శోభ నర్సింహులు మధ్య తరచూ వివాదాలు జరుగుతూ ఉండటంతో, శోభ తన పుట్టింటికి తిరిగి వచ్చింది. ఈ సందర్భంలో, నర్సిమ్లు మద్యం సేవించి వచ్చి తరచూ గొడవలు చేసేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 21న నర్సిములు శోభకు ఫోన్ చేసి తన కుమారుడికి సైకిల్ ఇస్తానని చెప్పడంతో, శోభ తన కుమార్తె మమతతో కలిసి అతనిని కలవడానికి మహబూబ్నగర్ వెళ్లిందిని, 22న దేవునిపల్లి గ్రామస్థుడు ఎరుకలి గోవిందు పొలం పనికి వెళ్తుండగా గ్రామ శివారులో దస్తయ్య పొలంలో శోభ శవమై కనిపించిందని పేర్కొన్నారు. వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా పోలీసు వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించి దర్యాప్తు ప్రారంభించినారు . ఈ విషయమై మృతురాలు తల్లి కరుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ ఇన్స్పెక్టర్ కే సీతారాం కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని షాద్ నగర్ డిసిపి శిరీష పరిశీలించారు.

# సీతారాముల కళ్యాణానికి అంతా సిద్ధం

**ములుగు, మార్చి 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని క్షీరసాగర్ గ్రామంలో గల శ్రీ కోదండ రామాలయంలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు, కెబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ గురువారం నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి గ్రామస్తుల సహకారంతో గ్రామ యువతతో కలిసి ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడానికి రంగురంగుల పూలతో కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ దీపాలు, భారీ సెట్టింగులతో వేదికను అలంకరించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలోనే పేరుగాంచిన గాయని గాయకులచే ఆర్కెస్ట్రా ఏర్పాటుచేసి భక్తి పాటలతో భక్తులను మంత్రముగ్దులను చేయడం జరుగుతుందన్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరు కానుండగా ప్రతి భక్తునికి అన్న ప్రసాదంతో పాటు శీతల పానీయాలు అందజేయడం జరుగుతుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను ఉత్సవ కమిటీ చూసుకుంటుందని తెలిపారు. గ్రామస్తులు, గ్రామ యువత సహకారంతో, కీర్తిశేషులు రాళ్లబండి శ్రీనివాస్‌శర్మ ఆశీస్సులతో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

# అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నాం

## రైతుల కళ్లలో ఆనందమే లక్ష్యం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**నంగునూర్, మార్చి 22, ప్రభాతవార్త :** ప్రభుత్వానికి ప్రజాపాలనకు రైతులు వెన్నుదున్నగా నిలుస్తున్నారని...అసాధ్యమైన అంశాలను సుసాధ్యం చేస్తూ సిఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నంగనురూర్ మండలం నర్మెటలో మలేషియా టెక్నాలజితో నిర్మించిన రూ.300 కోట్లతో నిర్మించిన అయిల్‌ఫాం ఫ్యాక్టరీని సిఎం చేతుల మీదుగా ప్రారంభించి రూ.80 కోట్లతో నిర్మించ తలపెట్టిన అయిల్ రిఫైనరీతో పాటు రూ.750 కోట్లతో నిర్మించ తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాట తప్పని మడమ తిప్పని నాయకునిగా సిఎం అభివృద్ధిలో సంక్షేమంలో ముందుకుసాగుతున్నారని తెలిపారు. ఒక రోజు 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల అప్పు తీర్చిన పెద్ద రైతు సిఎం అన్నారు. భారత దేశ చరిత్రలో 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సామాన్యులు, కష్టజీవులు, నేతన్నలు, రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. రైతుల కళ్లలో అనందం చూసే వరకు ఈ ప్రభుత్వం వెనకడుగు వేయదన్నారు. చిరు ధాన్యలు, పప్పుదినుసులు తదితర పంటలకు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకునేలా సిఎం దృష్టికి తీసుకవెళ్తానని తెలిపారు. ఎన్ని కష్టాలు వచ్చిన రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సిఎం ఆపడంలేదన్నారు. 16 నెలలలో అయిల్‌ఫ్యాం ఫ్యాక్టరీ పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటలోకి తెచ్చామన్నారు. అయిల్‌ఫాం పంట సాగు చేసి రైతులు సంతోషంగా ఉండాలన్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరిమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఒంటి నిండా విషాన్ని నింపుకొని మాట్లాడడం మానుకోవాలని పరోక్షంగా హరీష్‌రావుకు సూచించారు. ఆరోగ్యశాఖ మంత్రి



దామోదర రాజనర్సింహ్మా మాట్లాడుతూ రైతుల పక్షపాతి సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో పంట మార్పిడి చాలా అవసరం అన్నారు. అందరి సహకారంతో విద్య, సంక్షేమంలో సిఎం ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆరోగ్యశాఖలో 10 వేల పోస్టులు భర్తీ చేశామని త్వరలోనే మరో 10 వేల పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపి రఘునందన్‌రావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ంపి వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, ఐలయ్య యాదవ్, అయిల్‌ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పరిశ్రమల అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా ఆర్టీఏ సభ్యులు డాక్టర్ సూర్యచంద్రవర్మ, డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జిలు హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనంలో ఉండండి

**స్థానిక సమస్యలపై పోరాటాలతోనే ప్రజాభిమానం పొందుతారు**

**కేంద్రం ఇచ్చే పథకాలపై ఇంటింటికీ అవగాహన కల్పించాలి**

**బిజెపి శ్రేణులకు రంజిత్ మోహన్ దిశానిర్దేశం**

**రామాయంపేట, మార్చి 22, ప్రభాతవార్త :** బూత్ స్థాయి నుంచి బలపడి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ (బిజెపి) మూడు జిల్లాల ఇంచార్జి రంజిత్ మోహన్ సూచించారు. రామాయంపేట పట్టణంలో నిర్వహిస్తున్న రెండు రోజుల దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలపై పోరాటాలు చేయడం ద్వారా ప్రజాభిమానాన్ని సంపాదించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన, పసల్ బీమా యోజన, కృషి యోజన, హెల్త్ కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డు, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి మాతృ వందన పథకం వంటి పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత పది సంవత్సరాల్లో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక సంస్కరణలను విజయవంతంగా అమలు చేయడం అభినందనీయమని కొనియాడారు. యువత కోసం ప్రధానమంత్రి కౌశల్ యోజన, స్టార్ట్ అప్ ఇండియా, బేటీ బచావో బేటీ పడావో వంటి పథకాలు ప్రవేశపెట్టి వారికి కొత్త అవకాశాలు కల్పించారని తెలిపారు. రైల్వే రంగం సహా అనేక రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత మోడీ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఉపాధి హామీ కూలి మృతి

**వెల్దుర్తి. మార్చి 22, ప్రభాతవార్త :** మండలంలోని ఆరెగూడెం గ్రామంలో వడదెబ్బతో ఉపాధి హామీ పనిచేస్తున్న మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం నాడు చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి అరగుడం గ్రామం చెందిన ఏర్పుల నాగలక్ష్మి ్మ రోజు లాగే అడవిలోకి ఉపాధి హామీపై వెళ్లి ఇంటికి రాగానే పడిపోవడం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రథమ చికిత్స నిమిత్తం ఏరియా హాస్పిటల్ కి తరలించగా ఈమెను హైదరాబాద్ తీసుకెళ్లండి అని చెప్పడంతో హైదరాబాద్లోని గాంధీ హాస్పిటల్ కి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి చనిపోవడం జరిగిందని అన్నారు. నాగలక్ష్మి ్మ 45. మృతురాలికి మా కూతురు కొడుకులు తెలిపారు. కథ ముత్యాల కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.




# అక్రమంగా కలప తరలిస్తున్న వాహనం సీజ్

**ధారూర్, మార్చి 22, ప్రభాతవార్త :** ధారూర్ మండల కేంద్రంలోని కోట్ పల్లి చౌరస్తా వద్ద అక్రమంగా కలప తరలిస్తున్న ఒక వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ధారూర్ డిప్యూటీ రేంజర్ హేమ తెలిపిన వివరాల ప్రకారం.. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా కలపను తరలిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. పట్టుబడిన వాహనం కుమ్మరి రమేష్‌కు చెందినదిగా గుర్తించిన అధికారులు, వెంటనే వాహనాన్ని సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ మాట్లాడుతూ.. అటవీ సంపదను రక్షి ంచేందుకు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఎక్కడైనా అక్రమ రవాణాకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియ జేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# రింగ్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

**సిఎంకు ఎంపి రఘునందన్ వినతి**

**నంగునూర్, మార్చి 22, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు పలు అభివృద్ధి అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన ఎనిమిది ముఖ్య అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

గజ్వేల్‌లో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. అలాగే మల్లన్నసాగర్ కింద దుబ్బాక శాసనసభ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు కాలువల ద్వారా సాగునీరు అందించాలని, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని ఎనిమిది గ్రామాలకు నీటి సరఫరా కల్పించాలని కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు.



మిన్పూర్‌లో దుర్గమ్మ తల్లికి బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

## దుర్గమ్మ తల్లికి ఉగాది బోనాలు

**పుల్‌కల్, మార్చి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో కాపు సామాజిక వర్గానికి చెందిన గంగారపు కుటుంబ సభ్యుల తరఫున దుర్గమ్మ తల్లికి ఆదివారం బోనాలు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా బోనాలను తలపై ఎత్తుకుని శివసత్తుల ఆటపాటలతో డీజే సౌండ్‌కు యువత డ్యాన్సులు చేస్తూ బోనాలను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకుపోయి అమ్మవారికి బోనాలు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొనడంతో గ్రామంలో పండవ వాతావారణం కానవచ్చింది.

## గరికపాటిపై చర్యలు తీసుకోవాలి

**నాగల్‌గిద్ద, మార్చి 22, ప్రభాతవార్త:** పేద విద్యార్థులు ఆత్మగౌరవంపై తులనాడటమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలపై అపనిందలు మోపుతూ వాఖ్యానించిన గరికపాటి నరసింహారావుపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం నాగల్‌గిద్దలో ఎస్ గణపతి, వార్డు సభ్యులు తుకారాంలు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ప్రవచనాల పేరుతో పిల్లలపై అసభ్యంగా, అవమానకరంగా మాట్లాడిన గరికపాటి నరసింహారావును విద్యార్థి లోకం క్షమించదన్నారు. విద్యార్థులను శోభనం పెళ్లికొడుకుతో పోల్చడం విద్యార్థి లోకాన్ని అవమానించడం కాదా అన్నారు. పేద విద్యార్థులు కోడి గుడ్ల కోసమే పాఠశాలకు వెళుతున్నట్లు పేర్కొనడం శోచనీయంగా ఉందని, పేదరికాన్ని ఎగతాళి చేయడమే అని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులు హాజరరు పెరగడానికి, డ్రాపౌట్‌ను తగ్గించడానికి, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం అందించేందుకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారన్న కనీస జ్ఞానం లేకుండా మాట్లాడటం నరసింహారావుకు తగదన్నారు.

## వైఎస్ఆర్పి బలోపేతం కావడం తధ్యం

**మనూర్, మార్చి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో స్వయంభూవు ఉద్భవించి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీ నల్లపోచమ్మ ఆలయాన్ని ఆదివారం వైఎస్ఆర్‌పి రాష్ట్ర నేత డప్పు రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో అలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా రాజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణాలో వైఎస్ఆర్పి పార్టీ బలోపేతం కావడం తధ్యమన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## అమ్మ కృపతో అందరూ సుఖంగా ఉండాలి

**గుమ్మడిదల, మార్చి 22, ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఆదివారం నల్ల పోచమ్మ తల్లికి ఘనంగా పూజలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అమ్మవారికృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భం గా స్థానిక నాయకులు హుస్సేన్, మద్ది శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే యువకులు, పార్టీ కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

**రామచంద్రాపురం, మార్చి 22, ప్రభాతవార్త:** భారతీయ పార్టీ సిద్దాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. నాగులపల్లిలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ -2026ను ఉమ్మడి తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రశిక్షణ కార్యక్రమంలో అంజిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశ సమగ్రతకు పాటుపడుతున్న పార్టీ బిజెపి ఒక్కటే అని గుర్తు చేశారు.

# నాగ్సాన్‌పల్లి భూములను బ్లాక్ లిస్టు నుండి తొలగించండి

**పాపన్నపేట, మార్చి 22, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోని ఘనపురం ఆనకట్ట బ్యాక్ వాటర్ పరిధిలోని రైతుల భూములను బ్లాక్ లిస్టు నుండి తొలగించాలని సి.పి. ఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మల్లేశం, కే.మల్లేశం డిమాండ్ చేసారు. ఆదివారం సి.పి.ఎం ప్రతినిధి బృందం నాగ్సాన్ పల్లి గ్రామాన్ని సందర్శించి రైతుల సమస్యలపై అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మీడియాతో మాట్లాడుతూ 2015 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపునకు నిధులు విడుదల చేసి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించిందని తెలిపారు. పాపన్నపేట మండల పరిధిలోని నాగసానిపల్లి, కొడపాక, శేరిపల్లి శివారుల్లో భూసేకరణ చేసిందని చెప్పారు. కొడపాక, శేరిపల్లి గ్రామాల రైతులకు పరిహారం చెల్లించారని, నాగ్సానిపల్లి రైతులకు పరిహారం చెల్లించలేదన్నారు. వారి భూములను బ్లాక్ లిస్టులో పెట్టడంతో రైతులకు బ్యాంక్ లోన్ రావడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అత్యవసర పరిస్థితులో అమ్ముకునే అవకాశం లేకుండా పోయిందని విమర్శించారు. రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. నాటి ప్రభుత్వం పూర్తి నిధులు విడుదల చేయకపోవడంచే కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆనకట్ట కింద బెడ్ వేశారని, అరకొర నిధులతో ఆనకట్ట ఎత్తు పెంచలేదని పేర్కొన్నారు. రైతులకు పరిహారం చెల్లించుకోవడం, బ్లాక్ లిస్టులో పెట్టడం వల్ల అప్పులు చేసిన రైతులు కుమిలిపోతున్నారన్నారు. ఇప్పటికే ఆ బెంగతో ముగ్గురు రైతులు చనిపోయారని అన్నారు. తక్షణమే రైతుల భూములను బ్లాక్ లిస్టు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్చి 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో రైతులు పాల్గొనాలని పిలుపు ఇచ్చారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## భగత్ ఆశయ సాధన కోసం పోరాడాలి

**అమీన్‌పూర్, మార్చి 22, ప్రభాతవార్త:** భగత్ ఆశయాల కోసం నేటి యువతరం పోరాడాలని, ఆయన బాటలో నడవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే రాజయ్య పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా బీరంగూడలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. చిన్న తనంలోనే బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడి ఉరికంబం ఎక్కిన విప్లవ యోధుడు భగత్‌సింగ్ అని కొని యాడారు. కమ్యూనిస్టులు అధికారంలోకి రావాలని, అప్పుడే దోపిడీ లేని సమాజం ఉంటుందని ఆయన కోరుకున్నాడని వివరించారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉంటేనే యుద్ధాలు సంక్షోభాలు ఉండవని పేర్కొన్నారు. అదేవిధంగా విద్య, వైద్యం ప్రజలందరికీ అందుతుందన్నారు. పేదరికం, నిరుద్యోగం, ఆత్మహత్యలు తొలిగిపోతాయన్నారు. భగత్‌సింగ్ పేరు చెప్పి ఆర్ఎస్ఎస్, బిజెపి పబ్బం గడుపుకోవటానికి చూస్తున్నాయని, దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. భారతదేశ చరిత్ర మొత్తాన్ని ఆ పార్టీ వ్యక్తీకరిస్తోందన్నారు. భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. మోడీ చేతగానితనం వల్లనే దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయని.. కేంద్రానికి ఈ విషయంలో ముందుచూపు లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాణిక్, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, జార్జ్, సురేష్, మూర్తి, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**జహీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారు జాము పట్టణ శివారులోని జహీరాబాద్-బీదర్ రోడ్డులోని రైల్వే గేటు వద్ద చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ కే వినయ్‌కుమార్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం బీదదర్ పట్టణం వైపు నుంచి జహీరాబాద్ వైపు నడుచుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని (30 నుంచి 35 సంవత్సరాల వయసు) వెనుకాల నుంచి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొనడంతో బలంగా గాయలకు గురై అక్కడికి అక్కడే మృతి చెందినట్లు పట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి రంగయ్య గుర్తించి విషయాన్ని ఎస్ఐ కే వినయ్‌కుమార్‌కు తెలుపగా ఎస్ఐ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చమన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసు ఠాణాలో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.

## శాస్త్రోక్తంగా లంకా దహనం

**చౌటకూరు, మార్చి 22, ప్రభాతవార్త :** చౌటకూర్ మండల కేంద్రంలో అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. ఉత్సవాల్లో చివరి రోజైన ఉదయం లంకాదహనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భారీగా బాణాసంచా పేల్చి భక్తులు ఆనందోత్సవాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. జాతర ముగియ డంతో గ్రామంలో సందడి నెలకొంది. స్థానిక సర్పంచ్ పార్కల రాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ భూమి రెడ్డి గారి సుభాష్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు గ్రామంలో ఉన్న యువకులు మహిళలు తో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం పాల్గొని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రామా గౌడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వరకల రమేష్ వార్డ్ మెంబర్లు జైపాల్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంగలి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



చౌటకూర్‌లో అన్న ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

## రైతు భరోసా నిధుల విడుదలతో అన్నదాతలు హర్షం

**గుమ్మడిదల, మార్చి 22 ప్రభాతవార్త :** ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అన్నదాతలకు రైతు భరోసా నిధులను విడుదల చేయడంతో పాటు నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గుమ్మడిదల కానుకుంట రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారంగా ఏర్పాటు చేయగా, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో హాజరై వీక్షి ంచారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. శివప్రసాద్, పటాన్ చెరు ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్. శ్రీనివాసరెడ్డి, ఏఓ డి. శ్రీనివాసరావు, రాంరెడ్డిబావి సర్పంచ్ శ్రీ మహిపాల్ రెడ్డి, ఏఈఓలు జి. నిఖిత, ఆర్. అస్మిత పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని, రైతులకు మరిన్ని సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



కానుకుంట రైతు వేదికలో ప్రత్యేక ప్రసారం చూస్తున్న దృశ్యం

## సింగూరు నీటి విడుదలకు ఎమ్మెల్యే కృషి అభినందనీయం

**కొల్చారం, మార్చి 22, ప్రభాతవార్త:** సింగూరు జలాశయం నుంచి నీటి విడుదలకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేసిన కృషి అభినందనీయమని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఆదివారం కొల్చారం బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం "ఫోర్ ట్వంటీ" హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ మాత్రమేనని, ఇది పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలతో నడుస్తోందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోను పక్కన పెట్టి పాలన సాగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చొరవతో మంజీర పరివాహక ప్రాంతంలోని సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందబోతుందని తెలిపారు. దీనివల్ల లబ్ధి పొందే లక్ష మంది రైతుల ఆశీర్వాదాలు ఆమెకు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. అయితే ఘనపూర్ ఆనకట్టపై స్థానిక కాంగ్రెస్ నాయకులకు సరైన అవగాహన లేకపోవడం బాధాకరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, మాజీ జడ్పీటీసీ పాశం శ్రీనివాస్ రెడ్డి, ముత్యంగారి సంతోష్, మాజీ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్, మాజీ సీడీసీ చైర్మన్ సూరె నరేందర్ రెడ్డి, సంగయిపేట సర్పంచ్ పుర్రె కాంతమ్మ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

## నర్సాపూర్‌లో ఈద్ మిలాప్

**నర్సాపూర్ మార్చి 22, ప్రభాతవార్త :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నర్సాపూర్ పట్టణం లో ఎ1 హోండా షోరూమ్ మహ్మద్ ఖదీర్ అధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ చిలుముల సుహాసిని రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సోదరభావం, శాంతి, సహనానికి ప్రతీకనీ అన్నారు. ఈ కార్యక్రమం లో మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు వివిధ గ్రామాల సర్పంచులు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గ్రామ దేవతల రథోత్సవం

**కొల్చారం, మార్చి 22, ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని వరిగుంటం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరిం చుకుని ఆదివారం గ్రామ దేవతలైన దుర్గమ్మ, పోచమ్మలకు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని రంగురంగుల పూలతో అందంగా అలంకరించి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పిటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత ఘనంగా నిలిపారు.





## రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు

**జహీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 50 లక్షల రూపాయలతో చేపట్టేసిసి రోడ్డు, డ్రైనేజి కాల్వల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని గోవింద్‌పూర్‌లో 25లక్షలతో అండర్ డ్రైన్, గోవింద్‌పూర్, రాయిపల్లి (డి), అల్గోల్, బూచినెల్లి గ్రామాల్లో 5లక్షల రూపాయల చొప్పున సిసి రోడ్ల నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ గ్రామాల్లో సిసి రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ లాంటి సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, మాజీ ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, హోతి(బి), గోవింద్‌పూర్, రాయిపల్లి (డి), హుగ్గెల్లి, బూచినెల్లి, ఉగ్గెల్లి తండా పంచాయితీల సర్పంచ్‌లు మచ్చేందర్, కవిట వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సునీత శ్రీనివాస్, గేనిబాయి, మాజీ జడ్పీటిసి సభ్యులు యేసు రత్నం, మాజీ సర్పంచ్‌లు, నాయకులు వీరర్‌శెట్టి, రాజు, ఖలీల్, నర్సింలు, శేఖర పటేల్, చంద్రయ్య, రాములు, విజయ్, స్వామిదాస్, అమర్నాథ్‌రెడ్డి, మోహన్, వసంత్, సంజీవ్‌రావు, సామేల్, రాథోడ్ భీమ్‌రావ్ నాయక్, బిక్కు రాథోడ్, సంజయ్, బిక్కి బాయి, లాలూ, మధు జాదవ్, పరశురాం, దేవిదాస్, సునీల్, విజయ్, ఈశ్వర్, రామరెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీకాంత్, అనిల్, నర్సింలు, శామ్, మూబీన్, వీరన్న, అలోక్, మారుతి, రాజు సాబ్, శేఖర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, అబ్బాస్, ఇనయత్, తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్లలో ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు

**హుస్నాబాద్ రూరల్, మార్చి 22, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ తల్లి బోనాల వేడుకలు ఆదివారం గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో



పోచమ్మ బోనాల దృశ్యం

ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు రంగురంగుల చీరలతో, పూలతో అలంకరించిన బోనాలను నెత్తిన మోస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. బోనాల ఊరేగింపుతో గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. యువకులు కేరింతలు కొడుతూ, డప్పు చప్పుళ్లతో ఊరేగింపును మరింత ఉత్సాహంగా కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పోచమ్మ తల్లిని ప్రార్థిస్తూ గ్రామంలో ఎల్లప్పుడూ శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఎక్కడ చూసినా భక్తి పరవశం, ఆనందోత్సాహాలు కనిపించాయి.

## దత్తాత్రేయ ఆలయ నిర్మాణానికి రూ.51 వేల వితరణ

**సదాశివపేట, మార్చి 22, ప్రభాతవార్త:** మనస్ఫూర్తిగా దైవాన్ని ఆరాధించే వారికి ఆ భగవంతుడి ఆశీర్వాదం తప్పకుండా ఉంటుందని 22వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు గారెల తుల్జారాం అన్నారు. స్థానిక సంగమేశ్వర మందిర ప్రాంగణంలో ఏప్రిల్ 10వ తేదీ నుండి ప్రారంభమవుతున్న శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ భక్త బృందం తుల్జారాంకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ నిర్మాణ కార్యక్రమాలకు గాను తన వంతు సహాయంగా 51 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 వ వార్డు కౌన్సిలర్ గా నా శ్రీమతి గౌరీదేవిని గెలిపించి ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ఆ భగవంతుడు కల్పించాడని అన్నారు. వార్డు అభివృద్ధి కోసం ప్రజలు నా వెన్నంటి ఉన్నారని ఖి. దైవ కార్యంలో పాలుపంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. నా వార్డు ప్రజలను ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యవంతులుగా ఎదిగేటట్లు దీవించాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, పంతులు నారాయణరావు పంతులు, మాజీ కౌన్సిలర్ ఆకుల శివకుమార్, సుబ్రహ్మణ్యం, మారేపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న తుల్జారాం

## వాసవి పారాయణలో నర్సాపూర్ మహిళలు

**నర్సాపూర్ మార్చి 22, ప్రభాతవార్త :** హైదరాబాదులోని ఎల్ బి స్టేడియంలో నిర్వహిస్తున్న వాసవి మహాశక్తి మహోత్సవం పారాయణ కార్యక్రమానికి ఆదివారం నర్సాపూర్ ఆర్యవైశ్య మహిళలు తరలి వెళ్లారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంక్షేమం, అభివృద్ధి ట్రస్ట్, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ సహకారంతో వాసవి మహాశక్తి మహోత్సవం పారాయణ కార్యక్రమాన్ని హైదరాబాదులోని ఎల్బి స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు కోసంప్రయత్నిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతేగాక ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు కోసం ప్రయత్నించడం జరుగుతుంది. ఈ మేరకు ఈ కార్యక్రమానికి నర్సాపూర్ నుండి ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్ళి వాసవి మహాశక్తి మహోత్సవ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు

## రైతు మహోత్సవానికి చలోచలో ..

**తోగుట, మార్చి 22, ప్రభాతవార్త :** తొగుట మండలం తొగుట గ్రామం నుండి సిద్దిపేట జిల్లా నర్మెట్టలో జరుగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు రైతులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. నర్మెట్టలో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన రైతు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాగాల శోభా-కొండలు రెడ్డి, రాంపూర్ సర్పంచ్ లచ్చల రవీందర్, గొడుగు జయమ్మ, నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరి నరసింహులు, పబ్బతి మల్లారెడ్డి, మేకల రామస్వామి, భరత్ తేజతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. రైతు మహోత్సవ కార్యక్రమం విజయ వంతం కావాలని ఆశిస్తూ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తొగుట మండలం నుంచి గ్రామ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

**మనూర్, మార్చి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బెల్లాపూర్‌లోని దత్తగిరి ఆశ్రమంలో ఉగాది పర్వదినం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ఆనందగిరి మాత పేర్కొన్నారు. ఈ నెల 28వ తారీఖు వరకు జరిగే వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆశ్రమంలో దుర్గ సప్త పారాయణం, చండి హోమం, మంత్ర అనుస్థాన జపము కార్యక్రమాలు బెల్లాపూర్ గ్రామస్థుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆనందగిరి మాత సూచించారు.



బోరంచ నల్లపోచమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి

**మనూర్, మార్చి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువుండి భక్తులచే నిత్య పూజలందుకుంటున్న నల్లపోచమ్మ తల్లి ఆదయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయ అర్చకులు శ్రీకాంత్ స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ స్వామిలు వేద మంత్రాలు వల్లిస్తుండగా అమ్మవారికి ఒడిబియం నింపి కుంకు మార్చన పూజా కార్యక్రమాలు భక్త శ్రద్దల తో నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ధూళిమిట్ట, మార్చి 22 ప్రభాతవార్త,** మండలంలోని తోర్నాల గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరైనా 4 లక్షల రూపాయల నిధులతో పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం గ్రామ సర్పంచ్ చొప్పరి రాము కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా పాఠశాలకు సౌకర్యవంతమైన రహదారి కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం

..ప్రత్యేక పూజలు

**ఘట్‌కేసర్, మార్చి 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలో ఆదివారం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. శివారెడ్డిగూడ బస్తీ వేదికగా శ్రీదండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయ -మల్లిఖార్జునస్వామి దేవాలయ ఆవరణలో అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య గోమాతకు పూజ, హోమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వ హిందూపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత మహేందర్‌రెడ్డి విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి, హిందూ సమాజమని హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచి దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో నేటి కాలమాన పరిస్థితిల్లో ఎదురవుతున్న అనేక సవాళ్లని ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరమని ఆమె తెలిపారు. హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకాత్మత భావన, స్వధర్మం పట్ల అంకిత భావం సేవాగుణం వంటి వాటిని వికసింపజేసేందుకు అందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈహిందూ సమ్మేళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

## సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ టోర్నికి విద్యార్థినుల ఎంపిక



**ఘట్‌కేసర్, మార్చి 22, ప్రభాతవార్త:** సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు టిజిఎస్ డబ్ల్యుఆర్‌డిసి విద్యార్థినులు ఎంపిక అయ్యారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని మహేంద్రా హిల్స్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల హ్యాండబాల్ అకాడమీకి చెందిన విద్యార్థినులు కేరళలోని కొట్టాయం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈనెల 23 నుంచి 26 వరకు జరిగే టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు.



సత్యనారాయణ కాలనీ నూతన కార్యవర్గానికి సన్మానిస్తున్న నాయకులు

## సత్యనారాయణ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

**కీసర, మార్చి22, ప్రభాతవార్త:** నాగారం డివిజన్ పరిధిలోని సత్యనారాయణ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నుకున్న అధ్యక్షులు గుండ రంగారెడ్డి అన్నారు. ఆదివారం సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రధానకార్యదర్శిగా కాకర్ల నాగరాజు, కోశాధికారిగా గౌస్ మియా, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, నవీన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా అలివేణి, విశ్వనాథ్, రవికాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా హంస, సాయికుమార్ గౌడ్, కావేరి, కార్యవర్గ సభ్యులుగా, చిరంజీవి, ఉపేందర్‌రెడ్డి, మానస, గౌరవ అధ్యక్షులుగా రెడ్యానాయక్, ముఖ్య సలహాదారులుగా ఎల్లయ్య, మధుసూధన్‌రెడ్డి, సివిల్ టెక్ మధు, లక్కి శ్రీనివాస్‌రెడ్డి, రామక్రిష్ణ నాయక్‌లను ఎన్నుకున్నారు. ఇట్టి ఎన్నికలను రిటైర్డ్ టీచర్ ఎన్నికల అధికారి మధుసూధన్‌రెడ్డి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి, టిడిపి నాయకులు జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య, సురేందర్‌రెడ్డి, బిజేపి నాయకులు బిక్షపతి, ఎస్ఎన్‌సి కాలనీ మాజీ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అలియాబాద్ రైతు వేదిక వద్ద నుంచి శామీర్‌పేట ఉమ్మడి మండల రైతు ఉత్సవానికి బస్సులో బయలు దేరిన దృశ్యం

## రైతు ఉత్సవానికి తరలివెళ్లిన శామీర్‌పేట ఉమ్మడి మండల రైతులు

**శామీర్‌పేట, మార్చి 22, ప్రభాతవార్త:** రైతు ఉత్సవానికి శామీర్‌పేట ఉమ్మడి మండల రైతులు బస్సులో ఆదివారం తరలివెళ్లారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా రైతు వేదిక వద్ద నుంచి బస్సును రైతుల కోసం ఏర్పాటు చేశారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల రైతులు చేరుకుని వెళ్లారు. అయితే సిద్దిపేట్ జిల్లా నంగనూరు మండలం నర్మెట్ట గ్రామంలో జరుగుతున్న రైతు ఉత్సవాల్లో పాల్గొనటానికి వ్యవసాయ శాఖ వారి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులో ఈ కార్యక్రమానికి రైతులు తరలివెళ్లారు. రైతులు అంతా సామూహికంగా బస్సులో బయలు దేరారు. వ్యవసాయానికి సంబంధించిన నూతన పద్దతులు, సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకోవాలనే ఉత్సాహంతో వారు తరలివెళ్లినట్లు, ఈ ఉత్సవాలు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని, కొత్త ఆలోచనలు, తమ పంటల సాగుకు దోహద పడుతాయని రైతులు ఆశాభావంను వ్యక్తం చేశారు. అలియాబాద్ చౌరస్తా రైతు వేధిక వద్ద జరిగిన కార్యక్రమంలో శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్, ఎఇఒ రవి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎం.సంజీవరెడ్డి, మండల రైతు బంధు మాజీ అధ్యక్షులు కంఠం కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి ఇర్రి రవీందర్‌రెడ్డి, పలువురు రైతు నాయకులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు. శామీర్‌పేట ఎఇఓ రవి రైతులను బస్సులో సుమారు 50మందిని తీసుకవెళ్లటం జరిగింది. దీనిలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి, మేడ్చల్ మండలాల రైతులు పాల్గొనటం జరిగింది. .ఇక ఆదివారం సాయంత్రం అలియాబాద్ చౌరస్తా రైతు వేధిక నుంచి మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్, పలువురు మిగిలిన రైతులు ఈ రైతు వేధిక నుంచి ఉత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సర్పంచ్ వార్వల ఆంజిలయ్య



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

**కుల్కచర్ల, మార్చి 22, ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ వార్వల ఆంజిలయ్య, ఉప సర్పంచ్ విజయ్ కుమార్ అన్నారు. అదివారం మండల కేంద్రంలోని కాళ్యాణ్ నగర్ కాలనిలో బిజేపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లద్‌రావు, వార్డు సభ్యులతో కలిసి సిసి రెడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామం శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నమని, ప్రతి ఇల్లు, ప్రతి విధీ అద్దంలా ఉండేందుకృషి చేస్తున్న మని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ది చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్, వార్డు సభ్యులు గాదె లక్ష్మి మహిపాల్, నీరటి ఉత్తర కుమారి, ఉదయ్, పింకి అనిల్ కుమార్, సినియర్ నాయకులుజానకిరామ్, కర్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే అభివృద్ధి సాధ్యం

-చేవెళ్ల మండల ఎన్ఎస్‌యుఐ కమిటి సభ్యుడు ఎండి సమీరుద్దీన్

**చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త:** విద్యతోనే అభివృద్ధి సాద్యమౌతుందని, ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించడం వలనే కలిగే ప్రయోజనాలను గుర్తించాలని చేవెళ్ల మండల ఎన్ఎస్‌యుఐ కమిటి సభ్యుడు ఎండి సమీరుద్దీన్ అన్నారు. అదివారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిఎం రెవంత్‌రెడ్డి అద్వర్యంలో విద్యాశాఖలో చేస్తున్న నమూల మార్పుల వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. బడ్జెట్‌లోను విద్య శాఖకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్టాతులై ఉపాధ్యాయులు ఉంటారని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలన్నారు.



ఎండి సమీరుద్దీన్

## రైతు భరోసా నిధులు విడుదలపై మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు హర్షం

**మహేశ్వరం, మార్చి 22, ప్రభాతవార్త:**
రైతు భరోసా నిధుల ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమంలో మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షి ంచారు. సిద్దిపేట పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా స్కీం కు నిధులను విడుదల చేశారు. 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా 3,600 కోట్ల నిధులను బటన్ నొక్కి విడుదల చేశారు. ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో నేడు సోమవారం రైతుల అకౌంట్ల లో డబ్బులు జమ కానున్నాయి. మిగిలిన 9 వేల కోట్లను 45 రోజుల లోగా విడుదల చేస్తామని సీఎం ప్రకటించారు. అనంతరం రైతు భరోసా నిధులు విడుదల చేయడంపై మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో శివగంగ దేవాలయం చైర్మన్ అల్లె కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లె బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కరోల్ల రాములు, స్వర్ణగంటి సుభాష్, పాండు నాయక్, చందు, దేవేందర్ పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, మార్చి 22, ప్రభాతవార్త:** పట్టాలు దాటుతున్న ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య కెఎంఎన్‌ఓ 214/6-8 దగ్గర గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నాడని శనివారం రాత్రి 12 గంటల ముందు సికింద్రాబాద్ జీఆర్‌పి పోలీసులకు సమాచారం రావడంతో ఆర్‌హెచ్‌సి సత్యనారాయణసింగ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించాడు. మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. లభించిన ఆధారాలతో మృతుడు ఘట్‌కేసర్ శాంతినగర్‌కు చెందిన డి.క్రాంతికుమార్ (34)గా గుర్తించారు. పట్టాలు దాటే ప్రయత్నంలో రైలు నెంబర్ 12710 ఎక్స్‌ప్రెస్ కింద పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. శవాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్‌పి పోలీసులు తెలిపారు.

# ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- శామీర్‌పేటలో జరిగిన మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమం- సంఘం ద్వారా సేవా కార్యక్రమాలకు శ్రీకారం



తెలంగాణ మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి, జిల్లా బిజెపి కార్యదర్శి వి.సుదర్శన్ తదితరుల దృశ్యం



శామీర్‌పేటలో ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని ధరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, మార్చి 22, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా సమస్యలను పరిష్కరించటానికి అధికారుల దృష్టికి తీసుకవెళ్లటానికే మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ కేంద్రంలో పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తెలంగాణ మహిళా శక్తి మైవాయిస్ సంఘం ఆధ్వర్యంలో మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని ధరఖాస్తులను స్వీకరించారు. ఈ ధరఖాస్తులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లటం జరుగుతుందని అన్నారు. శామీర్‌పేట గ్రామం లోపల మెయిన్‌రోడ్డుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం సిసి రోడ్డును తవ్వి మధ్యలోనే పనులు చేపట్టకుండ వదిలేశారని, రోడ్డును తవ్వటంతో పాటు రోడ్డుకు పక్కనే రోడ్డులో పైపులు వేశారని ప్రజలకు ఇబ్బందికరంగ ఉందన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లాలని స్థానికులు కోరారు. రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, వీధి దీపాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు, పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా శక్తి వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగానే ప్రజా సమస్యలపై తమ సంఘం దృష్టిని సారించిందన్నారు. మహిళా శక్తి మైవాయిస్ సంఘం ద్వారా ప్రతి ఆదివారం ఒక గ్రామంలో సేవా కార్యక్రమంగా తీసుకుని మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవలు అందించటానికి, ప్రజా సమస్యలు పరిష్కరించటానికి సంఘం ద్వారా కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకంను ప్రజల శ్రేయస్సు సంక్షేమం కోసం ఆదుకోవటానికి తీసుకవచ్చిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైమారెడ్డి కోరారు. ప్రతి ఏడాదికి కేవలం 20రూపాయలు చెల్లిస్తే ఈ భీమా కింద ప్రమాదం జరిగితే 2లక్షల రూపాయలు అందనున్నట్లు ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు, ఆరోగ్యశిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో స్థానిక మాజీ ఎంపిటిసి సభ్యులు, మేడ్చల్ జిల్లా బిజెపి కార్యదర్శి వి.సుదర్శన్ కూడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మహిళా శక్తి ట్రెజరర్ రమేశ్ అంబటి, సభ్యులు బి.సాయికుమారి, పావని, జి.విజయలక్ష్మి, జైబూన్ తదితరులు స్థానికులు పాల్గొన్నారు.

## నాటి జ్ఞాపకాల పల్లకిలో... ముప్పై ఏళ్ల తర్వాత ఒక్కటైన మిత్రులు

- దౌల్తాబాద్ పూర్వ విధ్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- ఘనంగా గురువులకు సన్మానం చేసిన పూర్వ విద్యార్థులు

**ఔలాటీబాఊ్,మారితి 22, జుఎంఅభోవారటీ:** కోడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారంరోజు అపూర్వ ఘట్టం చోటుచేసుకుంది. స్థానిక ఫంక్షన్ హాల్ వేదికగా 1996-97 విద్యా సంవత్సరానికి చెందిన జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేలనం అత్యంత ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘ కాలం తర్వాత నాటి తోటి విద్యార్థులందరూ ఒకే వేదికపైకి చేరడంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.

**గురువులకు ఘన సన్మానం:**
ఈ కార్యక్రమానికి అప్పట్లో విద్య నేర్పిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. తమకు విద్యాబుద్దులు నేర్పి, ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులకు విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి, పాదాభివందనం చేశారు. ఈ సంధర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ..నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడటం చూడటం ఎంతో గర్వంగా ఉందంటూ ఉద్వేగానికి లోనయ్యారు.

**చిన్ననాటి స్నేహాల నెమరువేత:**
వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న మిత్రులంతా ఒక్కచోట చేరి తమ చిన్ననాటి అల్లరిని, పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుధీర్ఘ కాలం తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మిత్రులతో కలిసి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో 1996-97 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజరైన 1996-97 బ్యాచ్ పూర్వవిద్యార్థులు



## ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజు రేణుక ఎల్లమ్మ మునిరాజు కళ్యాణం

**కీసర, మార్చి22, ప్రభాతవార్త:** కీసర సర్కిల్ పరిధిలోని శ్రీ పెద్దమ్మ పెద్దిరాజు రేణుక ఎల్లమ్మ మునిరాజుల కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటలకు ఎల్లమ్మ లందకు పోవుట, 9.30 నిమిషాలకు ఘటం కుండ తేవుట, 10 గంటలకు అమ్మవార్ల కళ్యాణం, 12 గంటలకు పెద్ద పటం తొక్కుట, గొలుసు తెంపుట, అగ్నిగుండం తొక్కుట, 1 గంటకు వీరబోనం తీయుట, 2 గంటలకు రేణుక ఎల్లమ్మ తల్లి యాట మత్తగొలుపు, 3 గంటలకు ఎల్లమ్మ గాగుపట్టుట, సాయంత్రం 4 గంటలకు పెద్దమ్మ తల్లి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీసర ముదిరాజు సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో పెద్దమ్మ, పెద్దిరాజు రేణుక ఎల్లమ్మ, మునిరాజుల కళ్యాణ దృశ్యం

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ కార్యకర్తలతో మురళీకృష్ణ యాదవ్

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 22, (ప్రభాతవార్త):** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ యువనేత మురళికృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో పద్మారం సర్పంచ్ మోహన చారి నివాసంలో జరిగిన ఈ సమావేశానికి మురళీకృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే పార్టీకి బలమైన స్తంభాలని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, వారి గౌరవం, భద్రత కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మండలంలో నూతనంగా గెలుపొందిన సర్పంచులను సన్మానించి, గ్రామ అభివృద్ధిలో ముందుండాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. అనంతరం ఇంద్రానగర్ సర్పంచ్ మహబూబీ ఇచ్చిన రంజాన్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యకమ్రంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల మన్సిపల్ పరిధిలోని పల్లవి బోటిక్‌ను ప్రారంభించిన చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ

## మహిళలు ఆర్ధికంగా రాణించేందుకు ప్రభుత్వం చేయూత

**చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త:** మహిళలు ఆర్ధికంగా రాణించేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ వెల్లడించారు. ఆదివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులకు చేందిన మేస్త్రి లక్ష్మయ్య కుతురు పల్లవి ఏర్పాటు చేసిన పల్లవి బోటిక్‌ను చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ ప్రారంబీంచారు. ఈ సందర్బంగా చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ మాట్లాడుతూ మంజూరైన మహిళలు స్వయం ఉపాధితో ఉపాధి పోందాలన్నారు. మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకులు రుణాలందించేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. మహిళలు వ్యాపార రంగంలో అడుగు పెట్టేందుకు ప్రభుత్వం రుణాలను అందించి ప్రోత్సహిస్తుందన్నారు. చిన్న వ్యాపారాలు చేసుకోవాలనుకునే మహిళలకు బ్యాంకుతో మాట్లాడి రుణాలను ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గోన్నారు.

## బిసి బిల్లుపై కేంద్రం స్పందించాలి

రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వడ్ల కృష్ణ



వడ్ల కృష్ణ

**మోమిన్‌పేట్, మార్చి 22, ప్రభాతవార్త:** ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన దానిపై తక్షణమే అమలయ్యే విధంగా స్పందించాలని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వడ్ల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పక్షాన నిలబడి 42శాతం రిజర్వేషన్ అమోదించే విధంగా కేంద్రానికి సిఫారస్ చేసి బీసీల అభ్యున్నతికి పాటుపడుతుంటే ప్రధాని మోడి మాత్రం బీసీ బిల్లును ఆమోదింప చేయడంలో విఫలమవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని బీసీ సంఘాల పక్ష నాయకులను ప్రధాని మోడి వద్దకు తీసుకువెళ్లి ఆమోదించే విధంగా చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు.



చేవెళ్ల మన్సిపల్ పరిధిలోని రైతు వేదికలో రైతు ఉత్సవాలను ప్రత్యక్ష్యంగా వీక్షించిన చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి

## రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

-చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి

**చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు ఉత్సవాల ప్రత్యేక ప్రసారంను వీక్షించారు.

ఈ సందర్బంగా చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ఖాతాలకు నేరుగా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, చేవెళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, సర్పంచులు బుచ్చయ్య, రవి, రాంచంద్రయ్యగౌడ్, మహిపాల్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు మౌనిక , బాలకోటేశ్వరరావు తదిరతులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణకు సత్య సాధన ఫౌండేషన్ కృషి

**కీసర, మార్చి22, ప్రభాతవార్త:** వృద్ధుల సంరక్షణకు సత్య సాధన ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు సత్య సాధన ఫౌండేషన్ చైర్మన్ కొమ్మినేని సత్యనారయణ, జనరల్ సెక్రటరీ కొమ్మినేని విజయలక్ష్మీ అన్నారు. ఆదివారం నాగారం డివిజన్ పరిధిలోని గోదుమకుంట గ్రామంలోని టిపిఎస్ కాలనీలో సికింద్రాబాద్ సత్య సాధన ఫౌండేషన్ ఆద్వర్యంలో విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్ ప్రాంగణంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ అసిస్టెంట్ లివింగ్ సెంటర్ భవనాన్ని వారు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ సేవే... మాధవసేవ అనే లక్ష్యంతో లైఫ్ ట్రస్టు సేవా తత్పరత కలిగిన పెద్దల సమన్వయంతో ఏర్పటిన సంస్ద సత్య సాధన ఫౌండేషన్, విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్ ద్వారా వృద్దులకు సేవలు అందిస్తుందన్నారు. 2014లో వృద్దులకు ఆశాకిరణంగా ప్రారంభమైన విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్ మొదటగా కంఫర్ట్ లివింగ్ సెంటర్‌గా ప్రారంభమై వృద్దులకు సురక్షితమైన సౌకర్యవంతమైన నివాసాన్ని అందించిందన్నారు. సమగ్ర సేవల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద స్దాయి సౌకర్యం అవసరమని భావించి ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ అసిస్టెంట్ లివింగ్ సెంటర్‌ని నిర్మించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్ 170 మందికి పైగా వృద్దులకు సేవలు అందించగా ప్రస్తుతం 70 మంది వృద్దులు నివసిస్తూ సేవలు పొందుతున్నారని అన్నారు. వృద్దుల గౌరవ, భద్రత, జీవన నాణ్యతను పరిరక్షించే సమాజ ఆధారిత సహయ జీవన వాతావరణాల అవసరం పెరుగుతుందన్నారు.

వృద్దులు గౌరవంతో స్వతంత్రంగా జీవించ గలిగేలా సమగ్ర సంరక్షణ సేవలతో కూడిన పోషక వాతావరణాన్ని సృష్టించడం మా ధృక్పదం అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సహకారంతో వృద్దులకు సానుభూతి సంరక్షణను అందించడం మా లక్ష్యమని తెలిపారు. జీవితాంతం గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పిస్తూ ఆధ్మాత్మిక ప్రయాణం పూర్తయ్యే వరకు సంరక్షణ అందించడం మా సేవ తత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, ప్రోఫెసర్ డాక్టర్ శంకర్, కిమ్స్ హస్పిటల్ చైర్మన్ భాస్కర్‌రావు, రామోజీ ఫిలిం సిటి మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి విజయేశ్వరి. పద్మ శ్రీ అవార్డు గ్రహీత చంద్రమౌళి, సత్య సాధన ఫౌండేషన్ కోశాధికారి కాట్రగడ్డ లక్ష్మినరసింహ్మారావు, లైఫ్ ట్రస్టు డాక్టర్ రామక్రిష్ణ, కో ఆర్డినేటర్ సొనాలి తదితరులు పాల్గొన్నారు.



గోధుమకుంట టిపిఎస్ కాలనీలో ఇంటిగ్రేటెడ్ అసిస్టెంట్ లివింగ్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న సత్యసాధన ఫౌండేషన్ చైర్మన్ సత్యనారాయణ

## మిట్టకంకల్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం



పూడూరు మండల మిట్టకంకల్‌లో అంతర్గత సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రావుల గోపాల్,మొర్రి బందయ్య తదితరులు

**పూడూరు, మార్చి 22, ప్రభాతవార్త :** అందరి సహకారంతో మిట్టకంకల్ గ్రామాన్ని అభివృద్ధి చేయిస్తామని సర్పంచ్ గోపాల్,ఉప సర్పంచ్ మొర్రి బందయ్య పేర్కొన్నారు.పూడూరు మండలం పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ క్రింద మంజూరి అయిన రూ.5లక్షల నిధులతో ఆదివారం అంతర్గత సిసిరోడ్డు నిర్మానపు పనులను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అక్కడక్కడ మురుగునీరు ప్రవహిస్తున్నందున ఈ సమస్య పరిష్కారంకోసం తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రస్తుతంవేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఆయా కాలనీల్లో నీటి సరఫరా అయ్యే పైపుల లీకేజీలకు మరమత్తులు చేసి సరిచేయడం జరిగిందన్నారు.గ్రామంలోని వీధుల్లో స్ట్రీట్‌లైట్లను అమర్చామని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యామ్,పంచాయతీ వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టర్ ఆఫీస్

**యాచారం,మార్చి22, ప్రభాతవార్త:** దేవాదాయ భూమికల రైతుల పరిరక్షణ కోసం చేపట్టే పాదయాత్ర విజయవంతం చేయాలని కౌలు రైతులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అంజయ్య పేర్కొన్నారు.యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం రైతులతో పైసా కార్మిక సంఘం నాయకులు అంజయ్య సమావేశమై మాట్లాడారు.. నజ్దిక్ సింగారం,తాటిపర్తి, కుర్మిద్ద, నందివనపర్తి 4 గ్రామాల రక్షి త కౌలు రైతుల1400 ఎకరాలు సాగు చేస్తున్న భూములకు 37/ఏ టెనెంట్ సర్టిఫికెట్ ఆధారంగా పట్టాలు చేయాలనీ డిమాండ్ చేశారు.కుర్మిద్ద రెవెన్యూ పరిధిలో మర్ల కుంట, మంగలి గడ్డ ,పోతు బండ తండలల్లో గిరిజన లకు సంబందించి 30 ఎకరాల భూమి ఫ్యూచర్ సిటీ రోడ్ కోసం రైతుల అనుమతి లేకుండా బలవంతపు భూసేకరణ నిలిపి వేయాలని డిమాండ్ చేస్తు 23 మార్చి ఇబ్రహీంపట్నం నుండి చలో కలెక్టర్ ఆఫీస్ పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు.

## పేద కుటుంబాలకు వరంగా సిఎం సహాయ నిధి

**కొత్తూర్, మార్చి 22, ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి వరం లాంటిదని గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా అన్నారు. ఆదివారం కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వడ్ల గోపాల్‌కు రూ.60 వేలు, మైలారం స్వరూపకు రూ.58వేలు, మల్కాపురం మల్లేష్‌కు రూ.30 వేలు, మీసాల అమృతకు రూ.20వేలు,చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దయానంద్ గుప్తా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకునే స్థోమత లేని పేదలకు సిఎం సహాయ నిధి గొప్ప ఆర్థిక అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్, గట్టు చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసారం రాజు, ఉపాధ్యక్షుడు మోడీ శేఖర్, గట్టు బాలయ్య, గుండు కుమార్, మైలారం పెద్ద జంగయ్య, మధుసూదన్ రెడ్డి, మైలారం విశాల్, మల్లేష్, రాఘవేందర్ గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంకెల గారడి బడ్జెట్

**-ఆరు గ్యారెంటీల అమలేది..?-మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**

**కొడంగల్,మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడిగా కనిపిస్తుందని,ఆరు గ్యారెంటీల అమలు మాత్రం శూన్యమని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఆయన కొడంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప అభివృద్ధి శూన్యమని తేల్చి చెప్పారు.బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రూ.2లక్షల కోట్ల బడ్జెట్‌తో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారని ప్రస్తుతం రూ.3లక్షల కోట్ల బడ్జెట్ ప్రజలకు అందకుండా మంత్రుల జేబులోకి వెలుతుందా అని ప్రశ్నించారు.ప్రజలను మభ్యపెట్టేందుకు చూపించిన బడ్జెట్ మాత్రమే అని ఎద్దేవా చేశారు.సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణ మాఫీ చేశామని గొప్పగా చెబుతున్నా,తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కనీసం 30శాతం కూడా రుణమాఫీ చేయలేకపోయారని ఆరోపించారు.కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలు,స్కాంలతో కూడుకొన్న పార్టీ అని గత 65 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలను ప్రజలు గమ నిస్తునే ఉన్నారని తెలిపారు.ముఖ్యమంత్రి సోదరుడు అండతో బొంరాస్‌పేట్ మండలంలోని చెక్‌డ్యాంల నుంచి రూ.కోట్లలో ఇసుక వ్యాపారం కొనసాగుతుందని ఆరోపించారు.ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి,మధుసుదన్‌యాదవ్, విష్ణువర్దన్‌రెడ్డి, నవాజ్,కే. దయాకర్‌రెడ్డి, రఘు పతిరెడ్డి,మాజీ వెంకటయ్య,చిన్నయ్య,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## పదవిలో ఉన్నా... లేకున్నా అభివృద్ధే నా ఎజెండా..

**-దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా వెల్లడి**

**చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త:** పదవిలో ఉన్నా..లేకున్నా.. దామరిగిద్ద గ్రామ అభివృద్దే నా ఎజెండాగా పనిచేస్తానని దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా అన్నారు.చేవెళ్ల మున్సిపల్ ఎన్నికల సమయంలో 9వ వార్డులో ప్రజలకు ఇచ్చిన హమి మేరకు దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా తన స్వంత నిధులతో వెస్తున్న సిసి రోడ్డు పనులకు ఆదివారం చేవెళ్ల మున్సిపల్ ఛైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి,వైస్ ఛైర్మన్ రాముగౌడ్‌లతో కలిసి దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఇచ్చిన హమి మెరకు సిసి రోడ్డును తన స్వంత నిదులతో వెపించడం జరుగుతుందన్నారు.గతంలో పదవిలో ఉండి గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని, ప్రస్తుతం పదవిలేకున్నా.. గ్రామ అభివృద్ధికై పాటు పడుతున్నానన్నారు.ప్రజలకు ఇచ్చిన హమిని నేరవెర్చుతామని, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,వైస్ ఛైర్మన్ రాముగౌడ్, చేవెళ్ల మార్కెట్ కమిటి ఛైర్మన్ పెంటయ్యగౌడ్,వైస్ ఛైర్మన్ రాములు, కౌన్సిలర్‌లు బండారు శైలజ ఆగిరెడ్డి,మంగళి కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్,తాళ్ల పల్లి నర్సింలు, మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తా, నాయకులు ఆగిరెడ్డి,దేవర వెంకట్‌రెడ్డి,ప్రభుగుప్తా తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో సిసి రోడ్డు పనులకు శంఖుస్థాప చేసిన మున్సిపల్ ఛైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా,

## పేదల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలు**

**షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** పేద ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ ఫలాలు తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంధాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో ఆదివారం లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం, గ్రామంలో ఫార్మేషన్ రోడ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు గ్రామ సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకంతో అర్హులందరికీ ఇల్లు కట్టించి ఇస్తుందని తెలిపారు. అలాగే మహిళా సంక్షేమం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, ఆసరా పెన్షన్ లు, రేషన్ కార్డులు ఇలా ప్రజలకు అవసరమయ్యే పథకాలను తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కావలి చంద్రశేఖర్, రుద్రారం సర్పంచ్ యాదిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీశైలం, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు తలారి లక్ష్మమ్మ, వార్డు సభ్యులు రాఘవాచారి, గీత, యాదయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడీల కిష్టయ్య, గ్రామస్తులు రాజమల్లు, మహేందర్ రెడ్డి, అప్పలి కిష్టయ్య, వెంకటయ్య, చంద్రకళ, తదితరులు ఉన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

# కేబుల్ వైర్ దొంగల హల్‌చల్

**...60 బోరు మోటార్ల వైర్లను కత్తిరించిన దుండగులు**

**....ఆందోళన వ్యక్తంచేస్తున్న మంబాపూర్ గ్రామ రైతులు**

**పెద్దేముల్,మార్చి 22, ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నలకు ఎదో ఓ రూపంలో కష్టాలు తప్పడంలేదు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఒనర్చి పండించిన పంట చేతికొచ్చె వరకు గ్యారంటి లేదు. అసలే వేసవికాలం ఏ చిన్న పొరపాటున నీరు సరఫరా కాకుంటే పంటలు ఎండె పరిస్తితి దాపురిస్తుంది. అటువంటి వేసవికాలంలో పొద్దు మాపు పోలాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతన్నలకు ఇబ్బందులు తప్పడంలేదు. అందుకు ఉదహరణగా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో కేబుల్ వైర్ దొంగలు హల్‌చల్ సృష్టించారు. శనివారం రాత్రి సుమారు 60 మంది రైతుల పోలాల వద్ద గల బోరుమోటార్ల కేబుల్ వైర్లను దుండగులు కత్తిరించుకొని ఉడాయించారు.రైతులు ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్ళి చూడగా బోరు మోటార్లకు, స్టార్టర్లకు ఉన్న కనెక్షన్ వైర్లను కత్తిరించుకు పోవడంతో కంగుతిన్నారు. తన వద్ద కట్ చేసారంటు ఒకరు. తన వద్ద కట్ చేసారంటు మరోకరు ఇలా ఒకరికి ఒకరు చెప్పుకుంటే మొత్తము 60 మంది రైతుల బోరు మోటార్ల కేబుల్ వైర్లను దొంగిలించారు. అసలే వేసవి కాలం అందులో కేబుల్ వైర్లు కట్ చేయడంతో పంట పొలాలకు నీరు సరఫరా కాక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు దస్థప్ప, లింగప్ప, వెంకటయ్య, రాములు, నారాయణ, విష్ణు, నర్సిములు తదితరులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 60 మంది రైతుల పోలాల వద్ద ఒకే రాత్రి కేబుల్ వైర్లు దొంగిలించారంటే దొంగలు పెద్ద మొత్తంలో ఉన్నారా లేదా, బోరు మోటార్ల పనులలో అనుభవం ఉన్న వారా అని సందేహం కలుగుతోందని అంటున్నారు. కొత్త కేబుల్ వైర్‌ను కొనుగోలు చేయాలటే వ్యయ ప్రయాసాలతో కూడుకున్న విషయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాదిలో కూడా గుర్తు తెలియని వ్యక్తులు బోరుమోటార్ల దగ్గర కేబుల్‌వైర్లను దొంగిలించుకొని పోయారని గుర్తుచేశారు. రాత్రి వేళలో పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించి దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేబుల్ వైర్లను దొంగిలించిన విషయాన్ని పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.





బోరు మోటారు వద్ద కత్తిరించిన కేబుల్ వైర్

## పార్టీని బలోపేతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22, ప్రభాత వార్త:** పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత జిల్లా, మండల, మున్సిపల్ నాయకత్వంపై ఉంటుందని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్ 8 లోని అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యా కేంద్రంలో ఘట్‌కేసర్ మండల బీజేపీ నాయకులకు, బూత్ అధ్యక్షులకు, ముఖ్య కార్యాకర్తలకు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం శనివారం సాయంత్రం 4 గంటల నుండి ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు ఒక రోజు పాటు నిర్వహించారు. ఆదివారం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి పార్టీని అన్ని విభాగాల్లో బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని అన్నారు. గత 12 యేండ్లుగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పేద ప్రజల కొరకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టి విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. కేంద్రం చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి పార్టీకి క్యాడర్‌తో పాటు ఓటర్ల మనస్సును గెలుచుకోవాలని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశ ప్రగతి అనేక రంగాల్లో ముందంజలో ఉందని అన్నారు. కేంద్రం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న తప్పులను ఎత్తిచూపి బీజేపీ వైపు మళ్లే విధంగా బూత్‌ల వారిగా పార్టీ క్యాడర్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి. వీరేందర్ గౌడ్‌తో పాటు పలువురు వక్తలు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, నానావత్ బిక్కునాథ్ నాయక్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గొంగళ్ల బాలేశ్ కురుమ, కొమ్మిడి శోభారాణి, చలువాది ప్రవీణ్‌రావు, ఘట్‌కేసర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు బస్వారాజ్ గౌడ్‌లతో పాటు దాదాపు 200 మందికిపైగా పార్టీ క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యం కోసమే సిసి రోడ్డు!

**దేవాలయం చైర్మన్ రాఘవేందర్ గౌడ్.**

**కొందుర్గు మార్చి 22 ప్రభాతవార్త :** దేవాలయ దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యం కోసం సిమెంటు రోడ్ నిర్మిస్తున్నామని మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామ శివారులోని సంజీవపురం వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ రాజ మోని రాఘవేందర్ గౌడ్ అన్నారు.ఆదివారం నాడు ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎన్. ఆర్.ఈ. జీఎస్. స్కీం లో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్ నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు,పరిసర గ్రామాల ప్రజలు, దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ లంకల రామకృష్ణారెడ్డి, సభ్యులు ఉషన్న,దాసరి నర్సింహులు, మొత్కూరి శేఖర్, గ్రామ ఉప సర్పంచ్ రమేష్ నాయక్ తోపాటు వివిధ గ్రామాల నాయకులు శివారెడ్డి, గోవిందు,సుండు రాములు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## పాత హమీలకు పాతర... కొత్త హమీల జాతర

**బడ్జెట్ అంత డోల**

**బిఆర్ఎస్ నేతలు మీడయా సమావేశంలో విమర్శలు**

**కుల్కచర్ల,మార్చి 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపెట్టిన బడ్జెట్‌లో సబ్బండ వర్గాల ప్రజలకు అన్యాయం చేసింద ఎన్నికలకు ముందు ఎన్నో హమీనిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆశాతో ఎదురుచూసిన అన్ని వర్గాకు అన్యాయం జరిగిందని

కుల్కచర్ల బిఆర్ఎస్ మాజి రైతు బంధు అంధ్యక్షులు రాజు, సినియర్ నాయకులు మహేశ్వరం రాములు గౌడ్ అన్నారు. అదివారం మండ కేంద్రంలోని మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు ఎన్నికోల్లో ఇచ్చిన హమీలునెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికాంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హమీలను నేరవేర్చలేదన్నారు. 6 గ్యారంటిలు 420 హమీలతో అధికారంలోకివచ్చిన ప్రభుత్వం ప్రజను నయవంచనకు గురిచేసిందన్నారు.కమీషన్ల కోసమే ఇందిరమ్మ ఇండ్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక్క వృద్దాప్య పింఛన్, వితంతు పింఛన్ నూతనంగా ముంజూరు చేసింది లేదని విమర్శించారు.

రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, సుస్థిరమైన పాలన అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సినియర్ నాయకులు మాలే కృష్ణయ్య గౌడ్, బోయిని మొగులయ్య, బ్యాంగి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ**

**వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్**

**షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు, రైతు భరోసా నిధుల విడుదల ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ మండల అధికారి దండెం విజయచంద్ర, ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి వీక్షి ంచారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు బాగుపడినప్పుడే దేశం బాగుపడుతుందని, రైతు అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి అమలు చేస్తుందని తెలిపారు. నిరంతరాయంగా రైతు భరోసా అప్లికేషన్లను రైతుల నుండి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబాద్ సర్పంచ్ అశోక్, అంతారం సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, హైతాబాదు సర్పంచ్ శాంతమ్మ యాదయ్య, బోడంపహాడ్ సర్పంచ్ కమలమ్మచెన్నయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్, ప్రభాకర్ రెడ్డి, జంగయ్య, ప్రశాంత్ రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారిణీ మోనిక, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఎరువుల, పురుగుమందుల, విత్తన డీలర్లు, వ్యవసాయ సహకార సంఘాల స్టాఫ్, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, ఉత్తమ రైతులు, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ రైతువేదికలో ప్రత్యేక ప్రసారాన్ని వీక్షిస్తున్న చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారులు



## బడ్జెట్ లో 6 గ్యారంటీలకు నిధులేవీ

**పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**

**పరిగి, మార్చి 22, ప్రభాతవార్త :** 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ,అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడంతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు.ఆదివారం పరిగిలోని తన నివాసంలో పత్రికా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు..గడిచిన రెండున్నర సంవత్సరాల్లో 6 గ్యారెంటిలకు నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటని మహేష్ రెడ్డి అన్నారు మోసపూరిత పరిపాలన అందిస్తూ , అమాయకుల ఇండ్లను కూలుస్తూ, ప్రజల జీవితాలను,రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూనీ చేస్తుందని ఆరోపించారు.వచ్చే 2 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టి , కాంగ్రెస్ పార్టీకి తగ్గిన బుద్ధి చెప్తామని మహేష్ రెడ్డి తెలిపారు.

పోటో..రైటప్.

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో**

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

**-చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ వెల్లడి**

**చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త:**చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో 18వ వార్డులో అర్హులైన నిరుపేద ప్రజలందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ వెల్లడించారు.ఆదివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులోని నాగని స్వప్ప రాములుకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజను చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను త్వరగా చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు.ఇంటి నిర్మాణం చేసిన లబ్దిదారులకు సకాలంలో బిల్లులను వెంటనే అందజేస్తామన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇందిమర్మ ఇల్లు మంజూరు వరంలాంటిదని, ప్రభుత్వం సహకారంతో ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలను చేసుకోవాలన్నారు. 18వ వార్డును అదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని, వార్డులోని సమస్యలను అధికారులతో కలిసి గుర్తిస్తున్నామని, సమస్యలను అంచలంచేలుగా పరిష్కరిస్తామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ, సిసి రోడ్లు అవసరమైన వసతులను కల్పించేందుకు నిరంతరం పాటుపడుతామన్నారు. 18వ వార్డులో ఏలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ మాజీ డైరెక్టర్ మంగళి యాదగిరి, కాలనీ వాసులు ప్రభు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రారంభించిన చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ

## మహాభాగ్యం జ్యోతిర్లింగ దర్శనం

**..ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందం సభ్యుడు హరిగౌడ్**

**పెద్దేముల్, మార్చి 22, ప్రభాతవార్త:** జ్యోతిర్లంగ దర్శనం మహాభాగ్యమని తాండూరు హర్ట్ ఆఫ్ లివింగ్ బృందం సభ్యుడు హరిగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ ఈ నెల 24న మంగళవారం తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో 1000 సంవత్సరాల సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యము కల్పించనున్నట్లు తెలిపారు. జ్యోతిర్లింగ దర్శనానికి ముందు పూజ కార్యక్రమాలు, సత్సంగం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని దర్శించుకొని పునీతులు కావాలని ఆయన కోరారు.

**అంబేద్కర్ విగ్రహావిష్కరణకు మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు ఆర్థిక సహాయం**

**శామీర్‌పేట, మార్చి 22, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అనంతారం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయంను లక్ష్మాపూర్,మూడుచింతలపల్లి గ్రామాల మాజీ ఎంపిటిసి సభ్యులు పారుపల్లి నాగరాజు అందజేసినట్లు ఆ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అనంతారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటంతో పాటు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున సంఘం సభ్యులకు ఆయన ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందజేశారు.



అనంతారంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేసిన సంఘ సభ్యుల దృశ్యం

మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని అనంతారం గ్రామం (1వవార్డులో) ఏప్రిల్ 5న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతున్నందున చేయూత నివ్వటానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని, సేవలు దేశానికే ఆదర్శమని నాగరాజు అన్నారు. దీనిలో మండల నాయకులు ఎం.నవీన్, సురేశ్, సంతోష్, కుమార్, మల్లేశ్, సురేశ్, పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

**ఘట్‌కేసర్, మార్చి 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలోని స్వామి వివేకానంద కమ్యూనిటీహాలులో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్వర్గీయ నుంచు రాహుల్‌యాదవ్ జ్ఞాపకార్థం మాజీ ఎంపిటిసి నుంచు హేమలత పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్ రావునగర్ పేమ ఐ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన శిబిరంలో వైద్యులు, సిబ్బంది పలువురికి నేత్ర పరీక్షలు చేసి ఆపరేషన్లకు నిర్ధారించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందించేందుకు ఆర్డర్ చేశారు. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ విచ్చేసి నేత్ర శిబిరాన్ని సందర్శించి నిర్వహకులతో మాట్లాడారు. ఉచిత శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బర్ల శశికళ, బేతాల నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్ మంచాల అనిత శ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ఇడబ్ల్యుఎస్ కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, సామాజిక కార్యకర్తలు సార శ్రీనివాస్‌గౌడ్, శివరాత్రి సురేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.